సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 14 । నవంబర్ । 2023



నేటి నుంచి కార్తీక సందడి

నేటి నుంచి కార్తీక మాస సందడి మొదలు కానుంది. పూజల కోసం పలు ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

- 10లో ▸



ఎన్నికల ఉపాధి

అసెంబ్లీ ఎన్నికలతో పలువురికి ఉపాధి దొరుకుతోంది. వ్యాపారాలూ జోరుగా సాగుతున్నాయి.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.1 /15.7

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

నానుతున్న గల్ఫ్ కార్మికుల సంక్షేమం!

ఏళ్లతరబడి తీరని సమస్య

- తెలంగాణ ఏర్పడితే బొగ్గుబాయి, బొంబాయి, గల్ఫ్ వలసలుండవని ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రకటన
- ప్రత్యేక రాష్ట్రంలో మరింత పెరిగిన గల్ఫ్ వలసలు
- తమ కుటుంబాల సంక్షేమం ఏమైందంటున్న గల్ఫ్ కార్మికులు

ఇక్కడ ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు వలస వెళ్తే.. తమ కుటుంబాల సంక్షేమం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని వలస కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రవాసీ విధానం, గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలంటూ గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో ఆరు నియోజకవర్గాల నుంచి ఎన్నికల బరిలో నిలిచారు.





- తెలంగాణ ఏర్పాటైతే బొగ్గుబాయి, బొంబాయి , గల్ఫ్ దేశాల ఊసెత్తే అవసరముండదని కేసీఆర్ ఉద్యమ సమయంలో హామీ ఇచ్చారు. కానీ ఆ హామీలు నెరవేరలేదు. గల్ఫ్ వలస కార్మికుల కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి, దాని ద్వారా తిరిగి వచ్చిన వారికి ఉపాధి చూపాలని, రాష్ట్ర బడ్జెట్‌లో వీరి సంక్షేమం కోసం రూ.500 కోట్లు కేటాయించాలనే డిమాండ్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2018–19 రూ.100 కోట్లు ప్రకటించి నిధులు నామమాత్రంగా విడుదల చేసింది. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి మృతదేహాలను ఇళ్లకు తీసుకొచ్చేందుకు సైతం ఇబ్బంది అవుతోంది. గల్ఫ్ యేతర దేశాల్లో మరణించిన వారి మృతదేహాలను రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చుతో తెప్పిస్తోంది. గల్ఫ్ మృతుల విషయంలో వివక్ష కనిపిస్తోంది. ప్రవాసీ విధానం, గల్ఫ్ బోర్డు ఏర్పడితే ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదనే వాదన బలంగా ఉంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : స్థానికంగా ఉపాధి అవకాశాలు కరువవడంతో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల నుంచి చాలామంది గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్నారు. ఇలా వలస వెళ్లిన కార్మికులు తమ కుటుంబాల సంక్షేమం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలస కార్మికుల కోసం ప్రవాసీ విధానం(ఎన్‌ఆర్‌ఐ పాలసీ) అమలు లేదా గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో వలస కార్మికుల కుటుంబాల ఓట్ల ప్రభావం రాజకీయ పార్టీలకు తెలిసేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు. జేఏసీ నాయకులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తూ వలస కార్మికులతో సమావేశాలను నిర్వహించి ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేయడానికి సమాయత్తమవుతున్నారు. ప్రతి వలస కార్మికుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి రాజకీయ పార్టీలకు చెమటలు పట్టించేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఈ ఎన్నికల ద్వారా అమీతుమీ తేల్చుకునేందుకు సమాయత్తమవుతున్నారు. తెలంగాణ జిల్లాల నుంచి గల్ఫ్‌లోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), సౌదీ అరేబియా, ఖతర్, ఒమన్, బహ్రెయిన్, కువైట్ దేశాలకు వలస వెళ్లారు. గల్ఫ్ కార్మికులు ఏటా రూ.కోట్లాది విదేశీ మారక నిల్వలను ఇక్కడికి పంపుతున్నారు. వలస కార్మికుల్లో 5 శాతం మాత్రమే మంచి హోదాల్లో ఉన్నారు. మిగిలిన 95 శాతం మంది కూలీలే. ఈ క్రమంలో ఎన్నికల్లో తమ వాదన వినిపించే లక్ష్యంతో జేఏసీ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి అభ్యర్థులను బరిలోకి దింపారు.

గల్ఫ్ కార్మికులను నిర్లక్ష్యం చేయొద్దు..



గల్ఫ్ కార్మికుల అంశాన్ని పార్టీలు నిర్లక్ష్యం చేయడం సరికాదు. ఎన్‌ఆర్‌ఐలకు టిక్కెట్ ఇవ్వడానికి ఉత్సాహం చూపే రాజకీయ పార్టీలు గల్ఫ్ ప్రవాస కార్మికుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. వలస కార్మికుల్లో ఎంతో మంది ఆర్థికంగా స్థిరపడిన వారున్నారు. డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వకుండా అసెంబ్లీలో తమ వాణిని వినిపించే వలస కార్మికుల సంఘం నాయకులకు పోటీకి అవకాశం కల్పించాలి. గల్ఫ్ కార్మికులను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించక తప్పదు.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు

ఎన్‌ఆర్‌ఐ పాలసీపై దృష్టి సారించాలి



కేరళ తరహాలో తెలంగాణలోనూ ప్రవాసీ విధానం అమలు చేయాలి. ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేయడం వల్ల వలస కార్మికుల కుటుంబాలకు మేలు కలుగుతుంది. వలస కార్మికులు ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురవుతున్నారు. గల్ఫ్ వలస కార్మికుల విషయంలో సానుకూల దృక్పథం అవసరం.

– కడారి శ్రీనివాస్, గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి

ప్రవాసులకు అవకాశం ఇవ్వాలి



గల్ఫ్ దేశాల్లో పని చేసి ఇంటిబాట పట్టిన కార్మికుల్లో ఉత్సాహం ఉన్నవారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి. గల్ఫ్ ప్రవాసుల్లో చాలామంది పోటీకి ఉత్సాహం చూపుతున్నారు. రాజకీయ పార్టీలు దీనిపై దృష్టి సారించాలి. – సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, గల్ఫ్ జేఏసీ ప్రతినిధి

గల్ఫ్ జేఏసీ సత్తా చాటుతాం



వలస కార్మికుల కోసం కృషి చేస్తున్న వారిపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. గల్ఫ్ జేఏసీ సత్తా ఏమిటో చూపుతాం. కార్మికుల గళం వినిపించే నాయకులను బరిలోకి దింపాం.

– గుగ్గిల్ల రవిగౌడ్, గల్ఫ్ జేఏసీ చైర్మన్



ఎన్నికల బరిలో ఆరుగురు గల్ఫ్ జేఏసీ నాయకులు

గల్ఫ్ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు కనువిప్పు కలిగించడానికి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి ఆరుగురు ఎన్నికల బరిలో నిలిచారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున జేఏసీ కీలక నాయకుడు చెన్నమనేని శ్రీనివాస్ రావు(కోరుట్ల), జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ (వేములవాడ), ప్రవాసిమిత్ర కార్మిక సంఘం అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల (నిర్మల్), గల్ఫ్ జేఏసీ కార్యదర్శి బూత్కూరి కాంత(ధర్మపురి) , బూస రాకేష్ యాదవ్ (ఆర్మూర్), జేఏసీ నాయకుడు కృష్ణ దొనికెన (సిరిసిల్ల) నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల అంశాలపై ఫిర్యాదు చేయొచ్చు

సుభాష్‌నగర్ : బోధన్, బాన్సువాడ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల వ్యయ అంశాలపై తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల వ్యయ పరిశీలకులు తాన్యా సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో మినహాయించి మిగతా అన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు బోధన్‌లోని ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తనకు నేరుగా కలిసి ఆయా నియోజకవర్గాల ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేయవచ్చని, సలహాలు, సూచనలు అందించవచ్చని సూచించారు. నేరుగా కలిసేందుకు వీలుపడని వారు 83320 21892 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూంల పరిశీలన



బోధన్ : బోధన్‌లోని విజయ మేరి హైస్కూల్‌లోని ఈవీఎం స్ట్రాంగ్ రూంలను సోమవారం రాత్రి నియోజకవర్గ ఎన్నికల జనరల్ అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి లలిత్ నారాయణ్ సింగ్ సంధు పరిశీలించారు. స్ట్రాంగ్ రూం వద్ద భద్రత సిబ్బందితో మాట్లాడారు. ఈవీఎంల భద్రత విషయంలో పలు సూచనలు చేశారు. ఆర్‌ఐలు వరుణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు కామారెడ్డికి రేవంత్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి నుంచి బరిలో ఉన్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మంగళవారం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేయనున్నారు. ఆయన మధ్యాహ్నం 3.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. 4 గంటలకు రోడ్డు మార్గం ద్వారా రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి వెళతారు. సాయంత్రం 5 గంటలకు మాచారెడ్డి మండలం ఇసాయిపేటకు చేరుకుంటారు. 6 గంటలకు మాచారెడ్డి ఎక్స్ రోడ్డుకు, రాత్రి 7 గంటలకు చుక్కాపూర్ గ్రామానికి, రాత్రి 8 గంటలకు పాల్వంచ మండలంలోని ఫరీదుపేటకు చేరుకుని కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తారు.

రేపు ఎల్లారెడ్డికి కేసీఆర్



ఎల్లారెడ్డిరూరల్ : సీఎం కేసీఆర్ ఈనెల 15న ఎల్లారెడ్డిలో నిర్వహించే ప్రచార సభలో పాల్గొననున్నారు. ఆయన సభ కోసం నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం హెలీప్యాడ్ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ డీఈలు నారాయణ, గణేష్, డీఎస్పీ శ్రీనివాసులు స్థలాన్ని పరిశీలించి, ఏర్పాట్లను తెలుసుకున్నారు.

లబ్ధిదారులే కేంద్రంగా ప్రచారం

- పింఛన్ పెంచుతామంటున్న పార్టీలు
- రైతులను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థుల పాట్లు



ఆర్మూర్ : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం మొత్తం సంక్షేమ పథకాల లబ్ధిదారులు, రైతుల చుట్టూనే తిరుగుతోంది. ఆసరా పథకంలో భాగంగా పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను తమకు ఓటు వేసేలా చూస్తే సరిపోతుందని బీఆర్‌ఎస్ నాయకులు, ఈ లబ్ధిదారులను తమవైపుకు తిప్పుకుంటే సులభంగా గెలవొచ్చని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వాలు విస్మరించిన పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పింఛన్లు అందజేశామంటూనే ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ఈ పింఛన్‌ను రెట్టింపు చేస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. మరో వైపు బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేస్తామంటూ మోసం చేసింది కాబట్టి వారిని నాయకులను నమ్మొద్దని, పింఛన్‌లు తాము కూడా రెట్టింపు చేసి అందజేస్తామంటూ కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు తమ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, రుణామాఫీ, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు తదితర పథకాలతో లబ్ధి పొందిన వారి ఓట్లు పడేలా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో ఉన్న సుమారు రెండు లక్షల మందికి పైగా సంక్షేమ పథకాల లబ్ధిదారులు, మూడు లక్షలకు పైగా ఉన్న రైతుల ఓట్లన్నీ తమ వేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్, బీజేపీలు ప్రధానంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, దళితులకు మూడెకరాల భూమి తదితర హామీలను బీఆర్‌ఎస్ విస్మరించిందని ప్రచారం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను తమ ఖాతాలో వేసుకుంటూ బీఆర్‌ఎస్ ప్రచారం చేస్తుందని బీజేపీ అభ్యర్థులు ప్రజలకు వివరిస్తున్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి

- జూమ్ మీటింగ్‌లో అదనపు సీఈవో లోకేష్

సుభాష్‌నగర్ : ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటి కోసం సువిధ యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ సకాలంలో పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల అదనపు సీఈవో లోకేష్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. సువిధ యాప్ ద్వారా వస్తున్న దరఖాస్తులను పరిశీలించి, నిబంధనలకు లోబడి ఉన్న వాటికి నిర్ణీత గడువులోపు అనుమతులు జారీ చేయాలన్నారు. సీ-విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపైనా సత్వరమే స్పందించాలని సూచించారు. 15న నామినేషన్ల ఉపసంహరణ తర్వాత అభ్యర్థుల పేర్లు, గుర్తుల కేటాయింపులు, కమిషనింగ్ తదితర ప్రక్రియల నిర్వహణలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. 18న ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసుకోవాలని, అలాగే పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను కూడా చేపట్టాలన్నారు. జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఈడీఎం కార్తీక్, సిబ్బంది శ్రీనివాస్, పవన్, రషీద్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

26 మంది నామినేషన్ల తిరస్కరణ

- ముగిసిన నామినేషన్ల పరిశీలన
- ఈనెల 15 వరకు ఉపసంహరణకు గడువు

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమవారంతో ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో 26 మంది అభ్యర్థులు దాఖలు చేసిన అన్ని సెట్ల నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. ఈ నెల 10వ తేదీతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసిన విషయం తెలిసిందే. మొత్తం 128 మంది అభ్యర్థులు.. 230 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం 102 మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించి, గుర్తులు కేటాయించనున్నారు.

నామినేషన్ల పరిశీలన తర్వాత అభ్యర్థులు

నియోజకవర్గం	నామినేషన్ వేసినవారు	రిజక్ట్ అయినవి	మిగిలిన అభ్యర్థులు
ఆర్మూర్	26	05	21
బోధన్	23	08	15
బాన్సువాడ	19	02	17
అర్బన్	31	08	23
రూరల్	18	01	17
బాల్కొండ	11	02	09
మొత్తం	128	26	102

నోటీసుల పేరుతో తప్పించుకున్నారు

మళ్లీ చర్చకు సిద్ధం

- స్థలం చెప్తే ఆధారాలతో వస్తా
- డిసెంబర్ 3 తర్వాత అండర్ గ్రౌండ్‌కు బిగాల..
- బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ



ధన్‌పాల్ సూర్యనారాయణకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

సుభాష్‌నగర్ : నిజామాబాద్ అర్బన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తాను అవినీతిపై చర్చకు రమ్మంటే నోటీసుల పేరుతో తప్పించుకున్నారని బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అవినీతి బండారంపై బహిరంగ చర్చకు సిద్ధమవ్వగా పోలీసులు నోటీసులు జారీ చేశారన్నారు. బహిరంగ చర్చ కోసం ముందుగా ప్రకటించిన సమయం ప్రకారం సోమవారం కంఠేశ్వర్ ఆలయం వద్దకు బయలుదేరుతున్న ధన్‌పాల్‌ను పోలీసులు ఎన్నికల కోడ్ ఉందని అడ్డుకున్నారు. బహిరంగ చర్చకు అనుమతి లేదని ధన్‌పాల్‌కు నోటీసులు ఇవ్వగా ఆయన తీసుకోడానికి నిరాకరించారు. దీంతో ఆయన ఇంటికి నోటీసులు అతికించారు. విషయం తెలుసుకున్న బీజేపీ కార్పొరేటర్లు, శ్రేణులు పెద్దసంఖ్యలో ధన్‌పాల్ ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం ఆయన సీపీతో ఫోన్‌లో మాట్లాడారు. సహకరించాలని సీపీ కోరడంతో ధన్‌పాల్ నోటీసులు స్వీకరించారు. పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో నాయకులు, కార్యకర్తలు ఆయనకు సంఘీభావంగా ఉండి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ధన్‌పాల్ మాట్లాడారు. గణేశ్‌గుప్తా అవినీతి బండారం బాధితులే ముందుకు వచ్చి చెబుతున్నారన్నారు.

నోటీసులు అడ్డం పెట్టుకుని సవాల్‌కు రాలేదా.. వచ్చేంత ధైర్యం లేదా అని ప్రశ్నించారు. అవినీతిలో నిజామాబాద్ అర్బన్ మొదటిస్థానంలో ఉందని ఆరోపించారు. కళాభారతి స్థలాన్ని ఎందుకు మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా పని చేస్తున్న ఓ బిల్డర్.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాధను తట్టుకోలేక పని ఆపేశాడని ఆరోపించారు. ఆయన అవినీతి చిట్టా రోజుకొకటి చొప్పున బయటపెడతానని, ఎక్కడికి రమ్మంటారో చెప్తే.. ఆధారాలతో వస్తానని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. అధికారిక భవనంలో ఎందుకు ఉంటున్నావని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అర్బన్‌లో అవినీతి ఎక్కువ.. అభివృద్ధి తక్కువ అంటూ ఎద్దేవా చేశారు.

డిసెంబర్ 3 తర్వాత బిగాల గణేశ్‌గుప్తా అండర్ గ్రౌండ్‌కు వెళ్లడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, బంటు వైష్ణవి రాము, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, మెట్టు విజయ్, ఇప్పకాయల సుమిత్ర కిశోర్, ఇల్లెందుల మమతా ప్రభాకర్ పాల్గొన్నారు.

ధన్‌పాల్‌కు అవగాహన లేదు

- మినీట్యాంక్‌బండ్, ఐటీహబ్ చూస్తే అభివృద్ధి కనిపిస్తది
- ప్రజలే నా బాస్.. వారికే జవాబుదారీగా ఉంటా
- బీజేపీ అభ్యర్థి ఆరోపణలు పట్టించుకోను
- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: నగర అభివృద్ధి విషయంలో ప్రజలకు ఉన్న అవగాహన బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్‌కు లేదని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. ప్రజలే తన బాస్ అని.. వారికే జవాబుదారీగా ఉంటానని పేర్కొన్నారు. తనతో డిబేట్ చేస్తే పరువు పోతుందని బీజేపీ అభ్యర్థి నోటీసుల పేరుతో డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం నగరంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పొరేటర్‌గా గెలవలేని వ్యక్తితో చర్చ అవసరమా అని తమ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారని చెప్పారు. బీజేపీ అభ్యర్థి కొన్ని రోజులుగా అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ చేస్తుండటంతో తాను సిద్ధమే అని చెప్పానన్నారు. అయితే బహిరంగ చర్చలకు అనుమతి లేదని, శాంతి భద్రతల సమస్యలు వస్తాయని ఆదివారం రాత్రి పోలీసులు నోటీసులు ఇచ్చారన్నారు. పోలీసుల సూచన మేరకు డిబేట్‌ని రద్దు చేసుకొని, ప్రెస్‌మీట్‌కి వచ్చామన్నారు. తాను గుడి, బడి కట్టానని.. అయితే గుడి పేరు చెప్పి రాజకీయాలు చేయనన్నారు. కొందరు కుల మతాల మధ్య చిచ్చుపెట్టి గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. తాము చేసిన అభివృద్ధి ప్రజల ముందుంచి ఓట్లు అడుగుతున్నామన్నారు. నాలుగో సారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాని, ఎప్పుడు ఇటువంటి రాజకీయాలు చూడలేదన్నారు. తాము ఏం చేస్తామో చెప్పాలి కానీ అనవసర ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీజేపీ అభ్యర్థి మినీ ట్యాంక్ బండ్, వైకుంఠధామం, ఐటీ హబ్ దగ్గర చర్చ పెడితే తాము చేసిన అభివృద్ధి ఆయనకు కనిపించేదన్నారు. గత ఎన్నికల్లో తాను చేసిన అభివృద్ధి పనుల డిజైన్‌లను కరపత్రాల్లో వేస్తే అవి రంగుల బొమ్మలు అని హేళన చేశారని, ప్రస్తుతం అవి నిర్మాణం పూర్తి చేసుకొని ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. మరోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే నగరంలో 24 గంటలు మంచి నీరు ఇస్తామని, ప్రతి ఇంటికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కనెక్షన్ ఉచితంగా ఇస్తామన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఒక పార్టీ, నిజామాబాద్ నగరంలో వేరే పార్టీ ఎమ్మెల్యే ఉంటే గతంలో అభివృద్ధి జరగలేదని గుర్తు చేశారు. నిజామాబాద్ నగరం మరింత అభివృద్ధి కోసం, సంక్షేమం కొనసాగింపు కోసం మరొకసారి కారు గుర్తుకి ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, నూడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు సుజీత్‌సింగ్‌ఠాకూర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్, సిర్ప రాజు, యెనుగందుల మురళి, ధర్మపురి, అక్బర్ హుస్సేన్, రాజేంద్ర ప్రసాద్, అంబదాస్, మాదని శ్రీధర్, నర్సింహ, గోపరి లక్ష్మణ్, కొవూరి జగన్, గంగమని, కరిపే రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్‌ అండర్‌-15 రాష్ట్ర జట్టుకు శ్రీనికారెడ్డి ఎంపిక



జక్రాన్‌పల్లి: అర్గుల్‌ గ్రామానికి చెందిన కట్ట శ్రీనికారెడ్డి హైదరాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ అండర్‌–15 జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 25 వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో బీసీసీఐ ఉమెన్స్‌ అండర్‌–15 నిర్వహించనున్న టోర్నమెంట్‌లో శ్రీనికారెడ్డి పాల్గొననున్నారు. శ్రీనికారెడ్డి హెచ్‌సీఏ జట్టుకు ఎంపిక కావడంపై సర్పంచ్‌ గోర్త పద్మ, వార్డు సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనికారెడ్డిని అభినందించారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం



నిజామాబాద్‌నాగారం: క్రీడలతో విద్యార్థులకు ఆత్మ విశ్వాసం పెరుగుతుందని జిల్లా తైక్వాండో సంఘం కార్యదర్శి ఈశ్వర్‌, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు తిరునగరి శ్రీహరి అన్నారు. నగరంలోని రామకృష్ణ మఠంలో ఉన్న వివేకానంద ఆడిటోరియంలో క్యూరియస్‌ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కలర్‌ బెల్ట్‌ ప్రదానోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన తైక్వాండో ప్రదర్శన అందరినీ అలరించాయి. 150 మంది విద్యార్థులకు బెల్ట్‌ ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో మాస్టర్‌ వినోద్‌ నాయక్‌, రాకేశ్‌, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల ‘ఉపాధి’

- పలు రంగాలకు పెరిగిన డిమాండ్‌
- టెంట్‌హౌస్‌లు, పూలదండలకు గిరాకీ
- డప్పు, కళాకారులకు మంచి ఆదరణ
- రద్దీగా టిఫిన్‌ సెంటర్లు ,పెట్రోల్‌ బంక్‌లు
- జోరుగా మద్యం అమ్మకాలు
- ఉపాధి పొందుతున్న కూలీలు

బాన్సువాడ: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపునకు అభ్యర్థులు ఎంత ఖర్చయినా భరిస్తూ ముమ్మర ప్రచార నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పలు రంగాలకు ఉపాధి లభిస్తోంది. ప్రచారంలో ఉపయోగించే డప్పులు, జెండాలు, టోపీలు, ప్లకార్డులకు భారీగా ఖర్చు పెడుతున్నారు. ప్రచారంలో పాల్గొన్న వారికి టిఫిన్లు, భోజనాలు, మద్యం అందజేస్తున్నారు. దీంతో ఆయా రంగాల్లో వారికి భారీగా డిమాండ్‌ పెరిగింది. ఎన్నికల సమయంలో ఉపాధి తీరుతెన్నులపై వివరాలు..

డబ్బుతో పాటు భోజనం

ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అభ్యర్థులు తమ జన సంఖ్య బలం చూయించుకునేందుకు అడ్డా మీద కూలిపని చేసుకునే వారిని సైతం వెంట వేసుకొస్తున్నారు. వారికి డబ్బులతో పాటు భోజన వసతి కల్పిస్తున్నారు. ఎన్నికలు ఇలాగైనా ఉపాధి కల్పిస్తున్నాయంటు పలువురు కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భారీ గజమాలతో..

ప్రచారంలో భాగంగా తమ వార్డులకు, గ్రామాలకు వచ్చే అభ్యర్థులకు పూలదండలు వేసేందుకు కార్యకర్తలు, నాయకులు ఈ మధ్య పోటీ పడుతున్నారు. ఇటీవల కొత్తగా పెద్ద ఎత్తున పూల వర్షాలు కురిపించడం, క్రైయిన్లతో భారీ గజమాలలు వేయిస్తుండడంతో పూలదండలు అమ్మేవారి వ్యాపారం బాగా నడుస్తోంది.

మద్యం తప్పనిసరి

ఎన్నికల ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలకు, నాయకులకు సాయంత్రం అయితే మద్యం ఇవ్వాలి. అలా చేస్తేనే మరుసటి రోజు సమయానికి ప్రచారంలోకి చేరుకుంటారు. ఎన్నికల సమయంలో గిరాకీ ఎక్కువగా ఉండే వారిలో మద్యం ముందు వరుసలో ఉంటుంది.



ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న కళాకారులు

ఆర్డర్‌చేసిన చోటుకే..

ప్రచారాలు, సభలకు వెళ్లే ముందు నాయకులు, కార్యకర్తలకు ఉదయం పూట టిఫిన్‌లు తప్పనిసరి. మధ్యాహ్నం భోజనం కల్పిస్తుండడంతో హోటళ్లలో రద్దీ పెరిగింది. అభ్యర్థులు ఆర్డర్‌ చేసిన చోటుకే భోజనాన్ని పంపిస్తున్నారు. దీంతో హోటళ్ల యజమానులు మంచి వ్యాపారంతో పాటు పబ్లిసిటీ సైతం లభిస్తుందని భావిస్తున్నారు.

పెట్రోల్‌ బంకులకు..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ బలాలను చాటుకునేందుకు పెద్ద ఎత్తున కాన్వాయ్‌ నిర్వహిస్తున్నారు. అభ్యర్థి మద్దతుదారులు పదుల సంఖ్యలో కార్లు, సుమోలు వినియోగిస్తున్నారు. బైక్‌ల ర్యాలీ సందర్భంలో అయితే పెట్రోలు బంకుల్లో బారులు తీరాల్సిందే. నాయకులు, కార్యకర్తలకు అభ్యర్థులే పెట్రోల్‌ పోయిస్తున్నారు. సమావేశాల నిర్వహణకు అవసరమయ్యే టెంట్‌లు, కుర్చీలకు గిరాకీ పెరిగింది. ఏది ఏమైనా ఎన్నికలు కొన్ని వ్యాపార వర్గాలకు, కూలీలకు మంచి ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పొచ్చు.

కాంగ్రెస్‌లో సుదర్శన్‌రెడ్డిది ప్రత్యేక ప్రస్థానం

- ఏడో సారి ఒకే పార్టీ అభ్యర్థిగా నామినేషన్‌ రికార్డు
- హ్యాట్రిక్‌ ఎమ్మెల్యేగా మరో రికార్డు
- గెలుపు, ఓటమి.. మూడుసార్లు



జంగ్ తెలంగాణ

బోధన్‌: జిల్లా కాంగ్రెస్‌ రాజకీయాల్లో సీనియర్‌ నాయకుల్లో ఒకరైనా పొద్దుటూరి సుదర్శన్‌ రెడ్డిది ప్రత్యేక స్థానం. ఆ పార్టీ బోధన్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈ సారి ఎన్నికల్లో ఏడో సారి నామినేషన్‌ వేశారు. తన రాజకీయ జీవితంలో ఆరు సార్లు ఒకే పార్టీ తరపున పోటీ చేసి మూడు సార్లు గెలుపొంది మరో మూడు సార్లు ఓటమి చెందారు. నియోజకవర్గ కాంగ్రెస్‌ చరిత్రలో రికార్డుగా నిలిచింది. సుదర్శన్‌రెడ్డి తరహాలో ఇతర రాజకీయ పార్టీల నాయకులకు వరుసగా ఒకే పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్‌ వేసే అవకాశాలు రాలేదు. కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా 1999, 2004, 2009 ఎన్నికల్లో పోటీ చేసి వరుసగా మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్‌ ఎమ్మెల్యేగా మరో రికార్డు పొందారు.

మంత్రివర్గంలో లభించిన స్థానం

1952లో నియోజక వర్గం ఏర్పాటు నుంచి గెలిచిన కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలెవరికీ మంత్రి పదవులు దక్కలేదు. కానీ సుదర్శన్‌రెడ్డికి 2009 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి నేతృత్వంలో రెండో దఫా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం లభించింది. ఆ తర్వాత రోశయ్య, కిరణ్‌ కుమార్‌రెడ్డి హయాంలో కీలకమైన భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేశారు.

కార్యకర్త స్థాయి నుంచి..

నియోజకవర్గ పరిధిలోని నవీపేట మండలంలోని సిరాన్‌పల్లిలో సాధారణ రైతుకుటుంబం పొద్దుటూరి గంగారెడ్డి, రుక్మవ్వల సంతానం సుదర్శన్‌ రెడ్డి. సాధారణ ఉద్యోగిగా జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా వ్యాపార రంగంలో ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. 1986లో కాంగ్రెస్‌లో చేరి రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర మంత్రి స్థాయి వరకు ఎదిగారు.

1999లో తొలి విజయం

1989 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి కొత్త రమాకాంత్‌తో పోటీ పడి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపొందారు. 1994లో ఆయనకు టికెట్‌ రాలేదు. 1999 ఎన్నికల్లో రెండో సారి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం లభించింది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రమాకాంత్‌పై ఆధిక్యత సాధించి తొలి విజయం అందుకున్నారు. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో వరుసగా విజయం కైవసం చేసుకున్నారు. కాగా 2009 ఎన్నికల్లో మహా కూటమి (బీఆర్‌ఎస్‌, టీడీపీ) హోరులో జిల్లాలోని కాంగ్రెస్‌ అగ్రనేతలు డి.శ్రీనివాస్‌, షబ్బీర్‌ అలీ, కేఆర్‌ సురేశ్‌రెడ్డిలు ఓటమి పాలైనా సుదర్శన్‌ రెడ్డి మాత్రం ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచినా ప్రస్తుత ఎమ్మెల్యే షకీల్‌ చేతిలో ఓటమి పాలయ్యారు. తన రాజకీయ జీవితంలో ఇతర పార్టీల్లో చేరకుండా కాంగ్రెస్‌ రాజకీయాలతో ఉండటం ఆయన మరో ప్రత్యేకతగా చెప్పొచ్చు.

నేటి నుంచి కార్తీక సందడి

నేడు కంఠేశ్వర్‌ ఆలయంలో లక్ష దీపోత్సవం

నిజామాబాద్‌ సిటీ: జిల్లాలో నేటి నుంచి కార్తీక సందడి మొదలుకానుంది. మంగళవారం నుంచి నెల రోజుల పాటు జిల్లాలోని పలు శివాలయాలు విశేష పూజలతో శోభాయమానంగా కనిపించనున్నాయి. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో భక్తులు శైవక్షేత్రాలను దర్శించుకుంటారు. ఆలయ అధికారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతీ సోమవారం, ఏకాదశి రోజుల్లో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భారత్‌ జాగృతి ఆధ్వర్యంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం నగరంలోని శ్రీ నీల కంఠేశ్వర్‌ ఆలయంలో లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు జాగృతి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ భరద్వాజ్‌ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో కోనేరు ప్రాంత పరిసరాలను ఆలయ చైర్మన్‌ మహేశ్‌తో కలిసి పరిశీలించారు.



ఆలయంలో కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

బైండోవర్‌ అంటే ఏమిటి..?

ఆర్మూర్‌: ఎన్నికల సమయం వచ్చిందంటే పోలీసులు పాత నేరస్తులను పీఎస్‌కు పిలిపించి తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేస్తుంటారు. ఇంతకు బైండోవర్‌ అంటే ఏమిటి.. దాన్ని ఎందుకు ఉపయోగిస్తారనే విషయం చాలా మందికి తెలియదు. బైండోవర్‌ అంటే ‘బాండ్‌ ఫర్‌ గుడ్‌ బిహేవియర్‌’గా పేర్కొంటారు. ఒక వ్యక్తి వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావిస్తే ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్‌, ఆర్డీవో ఎదుట ప్రవేశ పెడతారు. క్రిమినల్‌ ప్రొసీజర్‌ కోడ్‌ (సీఆర్‌పీసీ) 107, 108, 109, 110 సెక్షన్‌ల కింద బైండోవర్‌ చేస్తారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేస్తారు. చట్ట వ్యతిరేక చర్యలు చేపట్టనని బాండ్‌ పేపర్‌పై లిఖిత పూర్వకంగా హామీని తీసుకుంటారు. అలాగే కొంత మొత్తానికి ష్యూరిటీ కూడా తీసుకుంటారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ ష్యూరిటీ మొత్తాన్ని అతడి నుంచి రికవరీ చేస్తారు. అంతే కాకుండా బైండోవర్‌ చేసిన వ్యక్తిపై అనుమానం వస్తే పోలీసులు 24 గంటల వరకు తమ అదుపులో ఉంచుకోవడానికి అవకాశం ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పాత నేరస్తులను బైండోవర్‌ చేయడం ప్రారంభించారు.

పటాకుల నిప్పులు పడి పత్తి దగ్ధం



తాడ్వాయి: క్రిష్టాజివాడిలో పటాకుల నిప్పులు పడి పత్తికాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం దీపావళి కావడంతో పిల్లలు పటాకాలు కాలుస్తుండగా గ్రామంలోని వెంకట్‌రెడ్డి ఇంట్లో ఉన్న పత్తికి మంటలు అంటుకున్నాయి. ఇంటి నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఆరు క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పేకాట స్థావరాలపై దాడులు

ఖలీల్‌వాడి/ కమ్మర్‌పల్లి/ధర్పల్లి/ ఎడపల్లి/ బోధన్‌ రూరల్‌/ ఆర్మూర్‌ టౌన్‌/ రుద్రూర్‌/ కోటగిరి/ పెద్దకొడప్‌గల్‌/ నవీపేట/ బిచ్కుంద/ భిక్కనూరు: నగరంలోని అర్సపల్లిలో ఉన్న నిజాం ప్యాలెస్‌ ఫంక్షన్‌ హాల్‌ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్‌ చేసి రూ.9380 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్‌ సోమవారం తెలిపారు. అలాగే తెలంగాణ పార్కింగ్‌ ఏరియాలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్‌ చేసి వారి నుంచి రూ.4480 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ. 22.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. ధర్పల్లి మండల కేంద్రంలోని గోసంగి కాలనీ, దమన్నపేట్‌ అటవీ ప్రాంత శివారులో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు రూ.4,800 నగదుతో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్‌, కుర్నాపల్లి గ్రామాల్లో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి రూ.19,730 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు.

బోధన్‌, సాలూర మండలాల్లోని పలు గ్రామాల్లో పేకాట ఆడుతున్న 34 మందిని అరెస్టు చేసి రూ1,37,280 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగనాథ్‌ పేర్కొన్నారు. ఆర్మూర్‌ పట్టణంతో పాటు పెర్కిట్‌, మామిడిపల్లిలో పేకాట ఆడుతున్న 26 మందిని అరెస్టు చేసి రూ.57వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు. రుద్రూర్‌ మండలంలోని అంబం(ఆర్‌), చిక్కడపల్లిలో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్ట్‌ చేసి రూ. 19,670 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నీరేశ్‌ పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని పలు గ్రామాల్లో పేకాట ఆడుతున్న 13మందిని అరెస్ట్‌ చేసి రూ.18,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

పెద్దకొడప్‌గల్‌ మండలంలోని పలు గ్రామాల్లో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసి రూ. 7050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కోనారెడ్డి పేర్కొన్నారు. నవీపేట మండలంలోని పలు గ్రామాల్లో పేకాట ఆడుతున్న 22 మందిని అరెస్టు చేసి రూ. 48,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు.

బిచ్కుంద మండలంలోని పలు గ్రామాల్లో పేకాట ఆడుతున్న 28 మందిని అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. భిక్కనూరు మండలంలోని సిద్దరామేశ్వరనగర్‌ గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. వీరి నుంచి రూ. 35,990 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

బీబీపేట: ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన బొడ్డు రాజమల్లు(33) ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబపరంగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసైన రాజమల్లు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై మరొకరు..

నాగిరెడ్డిపేట: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పోచారం ప్రాజెక్టులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌ జిల్లా హవేళి ఘణ్‌పూర్‌ మండలం వాడి గ్రామానికి చెందిన మంద శంకర్‌(41) భార్య యశోదతో కలిసి అత్తగారి గ్రామమైన పోచారంలో కొంతకాలంగా జీవిస్తున్నారు. శంకర్‌ మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో కుటుంబీకులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాజెక్టులో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఎస్సై ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మద్యానికి బానిసగా మారడంతో జీవితంపై విరక్తితో ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాత కక్షలతో ఒకరిపై దాడి



సిరికొండ: పాత కక్షలతో ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని చిన్న వాల్గోట్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన రొండ్ల దీప్‌ చాంద్‌రెడ్డి అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన గౌరు గంగ బాపు పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో గాయాలపాలైన చాంద్‌రెడ్డిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి అనంతరం దీప్‌ చాంద్‌ కుటుంబ సభ్యులు గంగ బాపు ఇంటిపై దాడి చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అశోక్‌ ఫారంలో ఇరువర్గాలు..

నిజామాబాద్‌రూరల్‌: మండలంలోని అశోక్‌ ఫారంలో ఇరువర్గాల మధ్య దాడి జరిగినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్‌ సోమవారం తెలిపారు. అశోక్‌ఫారంలో ఉండే అబ్బోళ్ల యమున, వారి ఇంటి పక్కనే ఉన్న మస్తాన్‌ బీ ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గతంలో గ్రామ పెద్దలు ఇరువర్గాలను పిలిచి సముదాయించారని ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. శనివారం రాత్రి వీరి మధ్య గొడవ జరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న ఓ ఫర్నిచర్‌ గోదాంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ. 5లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

తండ్రిని చంపిన తనయుడు

- డబ్బుల కోసమే హత్య
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు



పోశెట్టి (ఫైల్‌)



వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్సై

రుద్రూర్‌: కుటుంబ పరంగా రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాడనే కోపంతో ఓ కసాయి తనయుడు తండ్రిని చున్నీతో ఉరిబిగించి హత్య చేసిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ జయేశ్‌రెడ్డి, ఎస్సై నీరేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జవహర్‌నగర్‌ కాలనీకి చెందిన నక్క చిన్న పోశెట్టి(56) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి తాగిన మైకంలో కుమారుడు సాయిలు తండ్రి చిన్న పోశెట్టిల మధ్య డబ్బుల విషయమై గొడవ జరిగింది. తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాడనే కోపంతో ఇంట్లో ఒక్కడే నిద్రిస్తున్న తండ్రిని చున్నీతో ఉరిబిగించి హత్య చేశాడు. అనంతరం ఇంటికి తాళం వేసి స్థానికంగా ఉన్న వారికి హత్య చేసినట్లు తెలుపగా మద్యం మత్తులో చెబుతున్నాడని వారు పట్టించుకోలేదు. సాయిలు పోలీసుల ఎదుట తన తండ్రిని హత్య చేసినట్లు ఒప్పుకొని ఆదివారం లొంగిపోయాడు. సీఐ జయేశ్‌రెడ్డి, ఎస్సై నీరేశ్‌ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విచారణలో సాయిలు మద్యానికి బానిసయ్యాడని తెలిపారు. కుటుంబ, పొలం పరంగా రావాల్సిన డబ్బుల విషయమై పలుమార్లు తండ్రీ కుమారుడిల మధ్య గొడవలు జరిగాయని చెప్పారు. సాయిలు మద్యానికి బానిస కావడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



లక్ష్మయ్య మృతదేహం

ఇందల్వాయి: మండలంలోని తహసీల్‌ కార్యాలయం పక్కన ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పట్టణం రాజారాం కాలనీకి చెందిన లక్ష్మయ్య (45) తన కుటుంబంతో ఇందల్వాయికి వారం రోజుల క్రితం వచ్చి భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం వీరి వద్దకు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఈ స్థలం తమదని వెళ్లిపోవాలని బెదిరించారు. లక్ష్మయ్య వెళ్లకపోవడంతో వారు కర్రలు, ఇనుప పైపులతో దాడి చేసినట్లు భార్య కాశవ్వ తెలిపారు. అదే గాయాలతో నిద్రించిన లక్ష్మయ్య ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- ట్రాక్టర్‌ నుంచి ధాన్యం ఖాళీ చేస్తుండగా ప్రమాదం



చిన్న గంగాధర్‌(ఫైల్‌)

కమ్మర్‌పల్లి: ఆరుగాలం శ్రమించి పండించిన పంటే రైతును బలి తీసుకుంది. కల్లంలో ధాన్యం ఆరబోయడానికి ట్రాలీ నుంచి ఖాళీ చేస్తుండగా పైన ఉన్న విద్యుత్‌ లైన్‌కు తగిలి విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సామ చిన్న గంగాధర్‌(57) వ్యవసాయ క్షేత్రం నుంచి ట్రాక్టర్‌లో తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని కల్లంలో ఆరబోయడానికి డ్రైవర్‌ మారుతి ట్రాలీని పైకెత్తాడు. పైన ఉన్న 33/11 కేవీ విద్యుత్‌ లైన్‌ను డ్రైవర్‌ గమనించలేదు. దీంతో ట్రాలీ విద్యుత్‌ తీగలకు తగిలి విద్యుదాఘాతం సంభవించి డ్రైవర్‌ ట్రాక్టర్‌పై నుంచి కింద పడిపోయాడు. అక్కడే ధాన్యాన్ని నేర్పుతున్న ట్రాక్టర్‌ యజమాని, రైతు గంగాధర్‌ ఇంజిన్‌ను ఆఫ్‌ చేయడానికి ట్రాక్టర్‌ దగ్గరకు రాగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌కు తగలడంతో విద్యుత్‌ షాక్‌ తగిలింది. కాలిన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్‌ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

బిచ్కుంద(జుక్కల్‌): మండల కేంద్రంలోని బారడి పోశమ్మ ఆలయం ఎదుట బైక్‌ను డీసీఎం వ్యాన్‌ ఆదివారం రాత్రి ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహదారుడు పవన్‌రాథోడ్‌(20) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై మురళి సోమవారం తెలిపారు. పవన్‌ బిచ్కుంద నుంచి బైక్‌పై పెట్రోల్‌ కోసం బాన్సువాడ వైపు వస్తుండగా ఎదురుగా అతివేగంతో వస్తున్న డీసీఎం బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో పవన్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో టీవీ చోరీ

బోధన్‌ టౌన్‌: రాకాసీపేట్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎల్‌ఈడీ టీవీని దొంగిలించినట్లు సీఐ ప్రేమ్‌కుమార్‌ తెలిపారు. సోమవారం ఉదయం పీహెచ్‌సీకి వచ్చిన సిబ్బందికి గేటు తాళం పగులగొట్టి ఉండడం, టీవీ కనిపించక పోవడంతో సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని సారంగపూర్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా అబ్దుల్‌సాహెబ్‌ నుంచి రూ. 73,290 నగదు లభించినట్లు ఎస్సై రవీందర్‌ తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూయించక పోవడంతో నగదును సీజ్‌ చేసి ట్రెజరీ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

భిక్కనూరులో..



భిక్కనూరు: మండల కేంద్రంలోని పోలీసు చెక్‌పోస్టు వద్ద వాహనాలను చేస్తుండగా రెండు వాహనాల నుంచి రూ. లక్షా46వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ సోమవారం తెలిపారు. వీరు ఎలాంటి ఆధారాలు చూయించకపోవడతో టాస్క్‌ఫోర్స్‌ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

నర్సింగ్‌రావుపల్లిలో..



నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తని ఖీ చేస్తుండగా చీరలు, డబ్బులను పట్టుకున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కారులో రూ. 4.6 లక్షల విలువైన 253 చీరలను బాన్సువాడకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే హైదరాబాద్‌ నుంచి నాందేడ్‌ వైపు కారులో ఓ వ్యక్తి రూ. 3.05 లక్షల నగదు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో చీరలు, నగదును సీజ్‌ చేసినట్లు ఎస్సై రాజశేఖర్‌ పేర్కొన్నారు.

కొయ్యగుట్టలో మద్యం..



బాన్సువాడ రూరల్‌: మండలంలోని కొయ్యగుట్ట వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు బైక్‌పై రెండు కాటన్లలో తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. 17.28లీటర్ల మద్యం విలువ సుమారు రూ.17,280 ఉంటుందన్నారు. నిందితులను అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.